వేరు కాపురం

యం.ఉమామహేశ్వరరావు

డిశంబరు నెల రెండోవారం...

చిన్నగా చలిగాలి వీస్తోందంతటా సాయంత్రం ఆరుగంటలయింది. రిక్షా దిగి ఆ యింటి ముందాగేడు మూర్తి.

రిక్షావాడు వెనగ్గా మోసుకొచ్చిన మూటను మూర్తి ఆగిన దగ్గరే దించి, కూలి పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

వీధి లైటు వెలుగులో యింటి తలుపువేపు చూసి ఉలిక్కిపడ్డాడు మూర్తి. వరండాలో లైటు లేదు. ఆ తలుపుకు వేళ్ళాడుతున్న తాళం కప్పకేసి చూసి నిరుత్సాహం క్రమ్మింది. చిన్నగా అడుగులు వేసుకుంటూ వరాండాలోకి వచ్చేడు. ఇల్లంతా నిశ్శబ్దం తాండవిస్తోంది. ఆ వరాండాకు ఆనుకునే ఉన్న ఓ చిన్న సామాన్ల గదిలాంటి దాన్లో ఎవరో ఉన్నట్లు అనిపించడంతో రెండడుగులు అటువేసి 'ఏవండీ!!' అంటూ పిలిచాడు గొంతు కాస్త పెద్దది చేసి.

ఎవరూ?! ... అంటూ బయటికొచ్చిన ఆ మనిషిని చూడ్డంతోటే మూర్తిలో చిన్నగా శరీరం కంపించింది. ఎదురుగా అరవై సంవత్సరాల 'నరశింహం'గారు నించున్నారు.

''నువ్వటయ్యా...మూర్తీ! ... రా ... రా, ఏమేవ్! యిలారా! ఎవరొచ్చారో చూడు!?...''

అంటూ లోపలున్న భార్యను కేకేసేరు ఆనందపడిపోతూ! ...

''ఎవరూ?! ... అంటూ బయటికొచ్చింది నరశింహంగారి సతీమణి అన్నపూర్ణమ్మ. మూర్తిని చూసీ చూడగానే మరింత ఆనంద పడిపోతూ ''ఇదేనా రావడం? అంతా కులాసా యేనా? ... పిల్లలు బావున్నారా? వాసవి ఎలా ఉంది. క్షేమమే గదా!!...'' అంటూ కుశల ప్రశ్నల వర్షం కురిపించడంతో, వాళ్ళ ఆప్యాయతకూ, ఆ పలకరింపులోని మాధుర్యానికీ పరవశించి పోయాడు మూర్తి.

''ఆ! ... ఆ! ... అంతా కులాసాయేనండీ. ఎటొచ్చీ మీ యోగక్షేమాలే మాకు తెలీడం లేదు...'' అన్నాడు.

''వచ్చిన వాడిని అలా నించోబెట్టే మాట్లాడుతున్నావ్, కాళ్ళూ, చేతులూ, కడుక్కుందుకు నీళ్లు పట్టుకు రావడం ఉందా? ... లేదా ?! ... '' భార్యను కసురుకున్నారు నరశింహంగారు.

''అయ్యయ్యో ! ... నించోబెట్టే మాట్లాడుతున్నాను. ఉండుబాబూ! నీళ్లిస్తాను, కాళ్లు కడుక్కో ! ... ''

అంటూ లోపలకెళ్లి చెంబుతో నీళ్ళు తెచ్చి మూర్తి కందించిదావిడ. మూర్తి కాళ్ళు కడుక్కోవడం పూర్తిచేసి ఆవిడకు చెంబు తిరిగిస్తూ, ''మా చెల్లెలు పావనీ, మధూ,లేరా యింట్లో?'' అన్నాడు తలుపుకు వేసి ఉన్న తాళంకప్పను మరో మారు అనుమానంగా చూస్తూ.

''లేరు బాబూ ! ! ... అలా వీధిలోకి వెళ్లొస్తామని యిద్దరూ కలిసి సాయంత్రమే వెళ్లినట్లుంది ... ఇంకా రాలేదు ... నువ్వొచ్చిన సమయానికే లేకుండా పోయారు ! ... '' విచారిస్తూ అంది అన్నపూర్ణమ్మ.

మూర్తి సాలోచనగా తల పంకించాడు. అతని మనస్సు అరలలో ఏదేదో రగుల్తోంది. అదేమిటో బైటకు విప్పి చెప్పలేక పోయాడు. పార్వతీ—పరమేశ్వరుల్లాంటి ఆ వృద్ధ దంపతులను చూసి ఏమీ అడగటానికి గానీ తన మనస్సులో చెలరేగుతున్న ఆలోచనలను బైట పెట్టడానికి గాని ధైర్యం చాలడంలేదు.

తను యిక్కడకు వచ్చిన పని వేరు. తను ఊహించిందీ ... మనస్సులో ఆలోచించుకున్నదీ వేరు. కాని...అందుకు భిన్నంగా కనిపిస్తున్న ఆ వాతావరణం మరింత చిందర వందర ఆలోచన్లను రేపుతోంది. ఒకటాలోచిస్తే, మరొక్కటి ఎదురైనట్లుగా వుంది పరిస్థితి...

మూర్తి అన్యమనస్కంగా ఉండటం గమనించారు నరశింహంగారు. ''ఏమేవ్ ! మూర్తి యిక్కడే భోంచేస్తాడు. ఆ వంటా, అదీ ... వెంటనే కానీ...'' అన్నారు.

మూర్తి ఆలోచన్లకు నరశింహంగారు స్వరం అంతరాయం కలిగించడంతో చివాల్న తల త్రిప్పి ఆయన కేసి చూసాడు.

''ఓ ! ... అదెంతపని ? ! ... నిముషంలో అయిపోతుంది వంట ! ! ''

అంటూ లోపలకు వెళ్లిన అన్నపూర్ణమ్మ గారు 'ఏవండీ !' అంటూ భర్తను లోపలకు పిలిచింది.

''ఆ ! ఆ!! వస్తున్నాను... మూర్తీ ! నువ్వలా ఆ మంచంమీద కాస్సేపు రెస్టు తీసుకోవోయ్ !! ఈలోగా భోజనం రడీ అయిపోతుంది !'' అని కదలబోయారాయన.

''అబ్బే !... భోజనం ఏర్పాట్లు చేయకండి మామయ్యగారూ !.. [illegible]

యిల్లు చేరాలి. అక్కడ నాకోసం వాసవి ఎదురు చూస్తుంది, ఏ సమయానికైనా వచ్చేస్తానని చెప్పి మాటిచ్చాను.'' అంటూ వీధిలోకి చూసేడు మూర్తి.

''అలాగే వెళ్దువుగాని లేవయ్యా !... ఏదీ ?... మీ చెల్లెలుతోనూ... మావాడితోనూ కలిసి మాట్లాడందే వెళ్ళిపోతావా ? !... వాళ్ళొ ఈపాటికి వచ్చేస్తూ ఉంటారు. ఈలోగా నువ్వొ మంచంమీద నడుం వాల్చు. ప్రయాణంలో బాగా అలిసినట్లు కన్పిస్తున్నావు.'' అనేసి లోపలకు కదిలారు నరశింహంగారు.

మూర్తి మనస్సులో ఏదో చెప్పలేని సంఘర్షణ ప్రారంభమయింది. జేబులోంచి కనిపిస్తున్న ఉత్తరాన్ని పైకి తీసేడు. ఆ రోజు ఉదయాన్నే తన భార్య వాసవి ''మీ చెల్లెలు వ్రాసిందీ ఉత్తరం. చదవండి !'' అంటూ ఆ ఉత్తరాన్నందించింది. ఒకసారి చదివిన ఉత్తరమే అయినా... మళ్ళీ చదివేడు.

''...అన్నయ్యకు. మీ చెల్లెలు 'పావని' నమస్కరిస్తూ వ్రాయునది. నన్నూ... మీ బావగార్నీ యిక్కడ మా అత్తగారూ, మామగారూ వేరు కాపురం పెట్టించేసి, మా వంట మమ్మల్నే చేసుకుతినమని చెప్పేసేరు... ఇప్పుడు మేమిద్దరమూ వేరేగా ఉంటున్నాము. అంటే ఆ ఇంట్లోనే సెపరేట్‌గా ఉంటున్నాము. వేరు కాపురం పెట్టిన ఆడపిల్లకు కన్నవాళ్ళు మా సంసారానికి కావలసిన పప్పులూ, బియ్యం... వంట పాత్రలూ వగైరాలు అమర్చి యివ్వాల్ట. అమ్మా, నాన్నా, పోయేక నాకు నువ్వూ, వదినా తప్ప ఎవరున్నారన్నయ్యా ! ? ఈ చెల్లెలు సంసారం కోసం ఈ భారం నువ్వే తీసుకోవాలన్నయ్యా !... తప్పదు. మీ బావగారు కూడ యీ మాటే అంటూ నన్ను దెప్పిపొడుస్తున్నారు. కనక వెంటనే నువ్వు వచ్చి, ఆ ఏర్పాట్లన్నీ చెయ్యవలసింది. లేకుంటే ఈ చుట్టుప్రక్కల తలెత్తుకుని తిరగలేను. అత్తమామల హేళన భరించలేను... నీ రాకకోసం వెయ్యికళ్లతో ఎదురుచూస్తుంటాను.

ఇట్లు
నీ చెల్లెలు పావని

ఉత్తరం చదివి మడతబెడుతున్నప్పుడు భార్య అంది :

''తప్పకుండా వెళ్ళాలండీ మనం ?!! పావని వ్రాసినదాంట్లో అబద్ధం ఏమీలేదు. తమ ఆడపిల్ల వేరే కాపురం ఉంటున్నదీ అంటే ?... ఆమె మొదటి సంసారానికి కావలసినవి అన్నీ పుట్టింటి వాళ్ళే సమకూర్చాలి. పాపం ! పావనికి మనం తప్ప ఎవరున్నారు ?'' భర్త ముఖం వంకే చూస్తూ అంది వాసవి.

''అదికాదు వాసవీ ! ఇప్పుడంత అర్జంట్‌గా వీళ్ళను వేరే పెట్టెయ్యాల్సిన అవసరం ఏమిటొచ్చిందా అత్తమామలకు ? ? ... ఉన్నది [illegible]

వెరసి నలుగురు. ఇల్లా... అంత పెద్దదేం గాదు. అలాగని రెండు భాగాలదీ గాదు. అలాంటప్పుడు ఏం బరువైపోయారని వాళ్ళను వేరే పెట్టాలి చెప్పు ?''

అంటూ నశిగాడు తలపట్టుకుంటూ.

''... అక్కడే మీరు పొరపడుతున్నారండీ!.. బరువని గాదు. పెళ్ళయి సంవత్సరమే అయినా వాళ్ల ఆనందం కోసం... స్వేచ్ఛకోసం పాపం ఆ ముసలివాళ్ళు అలా చేసుంటారు... ఇందులో ఎవరేమనుకున్నా పుట్టింటి వాళ్ళం కాబట్టే మన ధర్మం ప్రకారం ఆమెకు సర్వసంబారాలూ అమర్చివ్వాలి ...''

స్థిరంగా అంది వాసవి. ఆమెకేదో చెప్పడాని కుద్యుక్తుడయ్యాడు మూర్తి. కాని ఆపేసింది వాసవి.

''మీరేం మాట్లాడొద్దు. వెంటనే ఆ సామాన్లేవో కొని, పట్టుకెళ్ళి పావనికి ఇచ్చిరండి. ఆమె బాధపడ్డంలో అర్థముంది.''

అంటున్న భార్య మాటలకు అడ్డొచ్చాడు మూర్తి.

''మొత్తానికి నువ్వూ ఆడదాన్ననిపించు కున్నావ్ !!'' అన్నాడు.

''అవునండీ !... ఆడదాన్ని గాబట్టే సాటి ఆడదాని ఆరాటం... బాధ... మనస్సు అర్థం చేసుకోగలిగేను. మరింకేం ఆలోచన్లూ రానివ్వ కుండా వెళ్ళండి !'' అంది వాసవి.

మూర్తి మరేమీ ఆలోచించకుండా, ఆ మధ్యాహ్నమే సామాన్లవీ కొని, చెల్లెలింటికి బయల్దేరేడు. అసలు పరిస్థితేవిటో? ... అంతర్జంటుగా వాళ్ళచేత వేరుకాపురం ఎందుకు పెట్టించాల్సొచ్చిందో ఆ ముసలి వాళ్ళను నిలదీసి అడగటానికే నిశ్చయించుకున్నాడు మనస్సులో...

మూర్తి ఆలోచనలు నుంచి తేరుకొని చూసేడొక్కసారి...లోపల చిన్నగా ఏడుస్తున్న అన్నపూర్ణమ్మగారి గొంతు ... ఊరుకొమ్మని ఆమెను సముదాయిస్తున్న నరశింహంగారు గొంతు వినిపించడంతో చివాల్న మంచంమీద నుంచి లేచి అటడుగులు వేసేడు.

''ఏం చెయ్యమంటారండీ! వంట?! ... ఇంట్లో ఏం ఉన్నాయని వండి పెట్టడానికి. ఇన్ని బియ్యంలేక మనమే కడుపునిండా తిని రెండ్రోజులయింది. పోనీ అబ్బాయిని ఏమైనా డబ్బు అడగండీ అంటూ మీకు చెప్తున్నా... వాడిని చస్తే అడగనని భీష్మించుకు కూచున్నారు. మీతోపాటుగా ఈ రెండ్రోజులుగా మంచినీళ్లే త్రాగుతున్నానో...గంజినీళ్లే త్రాగుతున్నానో... ఆ భగవంతుడికే తెలియాలి.''

కుమిలి, కుమిలి, ఏడవసాగిందామె.

''ఊరుకోవే ... అవతలా కుర్రాడువింటే బావుండదు. మన రెండు పొట్టలకు యింతన్నం పెట్టడానికే వాళ్ళకు బాధకలిగి విడిపోయి, వేరే వెళ్ళిపోయారుగా! ... తల్లిదండ్రులన్న అనుబంధం లేకుండా వాడలా వెళ్ళి భార్యతో వేరుకాపురం పెట్టుకున్నప్పుడు మనం మాత్రం ఏం చేయగలం? పోనీలే ... సంతోషించు ఈ కొట్టు గదిలోనన్నా ఉంచారు మెడబట్టి బయటకు గెంటెయ్యక. ఛ...ఛ...ఊరుకో...ఏదో సర్ది చెబుతానులే ... ఏడవకు. అతనుగాని వింటే బావుండదు!! ...''

భార్యను సముదాయించడానికి ప్రయత్నించ సాగారు నరశింహంగారు. ఆ మాటలు వింటున్న మూర్తి రెండు కళ్ళూ అశ్రుపూరితాలయ్యాయి. గుండె బరువుతో...నీరై పోయాడు. ఆపాద మస్తకమూ కరిగి...కరిగి చలించి పోయాడొక్క మారుగా !

''భగవంతుడా! కన్నబిడ్డ అయివుండీ, కన్న వాళ్ళు బరువై పోయారని దూరం చేసుకుంటు న్నాడా మధు?! ... పోనీ, తన చెల్లెలు పావనికే మొచ్చింది ? తల్లిదండ్రుల్లా భావించాల్సిన అత్తమామల్ని చూసుకోవడం యిలాగేనా?! ... నెత్తిన పెట్టుకుని పూజించకపోయినా...కనీసం శత్రువుల్లా ఉండకూడదే...''

ఆలోచిస్తున్న మూర్తి మనస్సులో అసంకల్పితంగా ఏదో ఆలోచన ఉరికింది. అతని మనస్సు తేలిగ్గా అయింది.

అతని కన్నుల్లోంచి అంతవరకూ ఉబుకుతున్న కన్నీటి బిందువులస్థానే కరుణ



ప్రవహించింది. జాలి హిమోత్పాతమైంది. వెన్నెల మనస్సు నిండా చేరి వెలుగులు నింపింది.

నరసింహంగారు బయటకు వస్తున్న 'చడి' కావడంతో మంచంమీద వాలిపోయాడు.

నరసింహంగారు బయటకు వస్తూనే —

"!!...మరిచేపోయానోయ్ మూర్తీ !... వెధవది అరవై ఏళ్ళు వచ్చేశాయి కదూ?! మతి మరుపు ఎక్కువైందీ మధ్య ?!... ఈ రోజు శనివారం గదూ !... పాపం, మీ అత్తయ్య వంటా—వార్పూ చెయ్యదు... పోనీ నీ కోసం, ఏ టిఫనో చేయమంటావా అంటే ?... ఛ...ఛ ... టిఫినేం ఖర్మ ? శుభ్రంగా ఇవాల్టికి భోజనం వండేశెయ్ ! అంటూ చేప్పేసేను... పిచ్చిది... అయోమయంగా నాకేసి చూస్తుండిపోయిం దనుకో..."

ఇంకా ఏదో అంటున్నారాయన.

ఏమీ చేయలేని తన అశక్తతను ఎంత చిర్నవ్వుతో దాటవేస్తున్నారీయన... గుండెల్లో రగుల్తున్న అగ్నిగుండాల్ని చిర్నవ్వుతో భరిస్తూ తియ్యటి ఓ అబద్ధాన్ని ఎంత అందంగా చెప్తున్నారు ?"..."

మూర్తి యిబ్బందిగా ముఖం పెట్టి కదుల్తూ, "అబ్బెబ్బె !... అసలు నాకేమీ వద్దండి ... అసలీరోజు రాత్రి నేను కూడా భోంచేయను. టిఫెనుకూడా చెయ్యను...శనివారం కదా ?!... వారంలో ఒక్క పూటైనా ఉపవాసం చేస్తే శరీరాని కెంతో ఆరోగ్యం అన్నారు గాంధీజీ...నాకోసం పాపం అత్తయ్యగారిని శ్రమ పెట్టకండి !" అన్నాడు.

"కాని...మూర్తీ !..." ఏదో అనబోయారు నరసింహంగారు.

"మావయ్యగారూ ! దయచేసి ఆ విషయం ఒదిలేయండి... ప్లీజ్ !... నేనిక్కడకు వచ్చిందీ, చేయబోయిన పనీ, ఒకటైతే, యిప్పుడు నా మనస్సులో వచ్చిన ఆలోచనా... యిప్పుడు తీసుకున్న నిర్ణయమూ మరొక్కటి !!!"

"ఏమిటి బాబూ !?" ఆశ్చర్యంగా అడిగారు నరశింహంగారు.

"చూడండి మావయ్యగారూ ! ముందీ సామాన్లన్నీ లోపలకు తీసుకువెళ్ళండి. అత్తయ్యా, మీరూ నా యందు అభిమానం వుంచి కాదన కూడదు. వీటన్నింటినీ వాడుకోండి ..." దగ్గరే ఉన్న సామాన్ల మూటను అటు పెడుతూ అన్నాడు మూర్తి.

"అదికాదు మూర్తీ ..." లోపల్నుంచి వస్తూనే అంది అన్నపూర్ణమ్మ. మూర్తి ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసేడు.

"నాకు తెలుసునత్తయ్యా ! ఎవర్ని ఎవరు వేరేపెట్టేరో యిప్పుడు నాకు బాగా తెలిసింది. దయచేసి మరేమీ అనుకోవద్దు. మీ బిడ్డడిగానే భావించి యిది తీసుకొండి !!!" అన్నాడు.

వేరు కాపురం

"కాని అవి మీ చెల్లెలి వేరుకాపురం కోసం తెచ్చినవికదా !! అవి మాకిచ్చేస్తానంటావేమి టయ్యా ?" నరశింహంగారు కలుగజేసుకున్నారు.

"అవును. మా చెల్లెలు పావని వేరుకాపురం పెట్టిందని తెలిసి తెచ్చేను. కాని, యిక్కడికి వచ్చేక నగ్నసత్యం బోధ పడిందండీ ... ప్లీజ్... నా కోరిక మన్నించండి ..." ప్రాధేయపడ్డాడు మూర్తి.

నరశింహంగారు, అన్నపూర్ణమ్మ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. సరిగ్గా, యిదే సమయంలో ... ఆ ఇంటి వాకిట్లో స్కూటరాగింది. స్కూటరు దిగి లోపలకు వస్తూనే వరాండాలో నించుని తన అత్త మామలతో మాట్లాడుతున్న మూర్తిని చూడగానే ఎగిరి గంతేసింది పావని.

"ఎంతసేపయిందన్నయ్యావచ్చి ? అరెరె... అలా నుంచునే ఉన్నావా ? రా ... లోపలకి ?" అంటూ తలుపు తెరచి లోపలకు వెళ్ళింది పావని.

"ఏదీ ? వచ్చి ఓ గంటయింది."

అన్నాడు మూర్తి చెల్లెల్ని చూడగానే కలిగిన కోపాన్ని కంట్రోలు చేసుకుంటూ.

"ఏవండీ !! ఇదేనా రావడం ?" పలక రించాడు మధు.

"ఆ ! ఆ !! ... యిదేనండీ !!" జవాబిచ్చాడు మూర్తి లోపలకు చూస్తూనే.

లోపల్నుంచి వచ్చింది పావని.

"లోపలకి రండన్నయ్యా ! ! ఒక్క పది నిముషాల్లో వంటయిపోతుంది. అలా ఆ సోఫా మీద కూర్చో " మళ్ళీ హడావుడిగా లోపలకు వెళ్లబోతూ అంది పావని. కాని మూర్తి ఆపేసేడు చెల్లెల్ని.

"ఆ అవుసరం లేదు పావనీ. ఇప్పుడే మీ అత్తయ్య బలవంతం చేస్తే అక్కడే భోంచేసేను." చెల్లెలు ముఖంలో కదిలే రంగుల్ని గమనిస్తూ అన్నాడు మూర్తి.

"అదేంపనన్నయ్యా ?...చెల్లెలింటికి వచ్చి భోంచేయకుండా, వేరేచోట భోంచేస్తావా ?" నిష్టూరంగా అంది పావని.

"అవునమ్మా...

... చెల్లెలు వేరుకాపురం ఉందని, కన్న బిడ్డల కంటే ఎక్కువగా చూసుకుంటున్న ఈ మా చెల్లెలి అత్త మామలు, యిలా అర్ధాంత రంగా సంవత్సరం కాకుండగానే, ఎందుకు వేరే పెట్టించేరో !! నిలదీసి వాళ్లను అడుగుదామని వచ్చేను. ఆ వేరు కాపురం ఉంటున్న చెల్లెలి కోసం సంసారానికి సరిపడా సామాన్లూ తెచ్చేను. కాని...ఆ చెల్లెల్లో చెల్లెల్నికాక మానవత్వం లేని ఓ మనిషిని చూస్తున్నానిప్పుడు. తల్లిదండ్రు ల్లాంటి అత్తమామలకు కనీసం చారెడు గింజలు తినడానికివ్వలేదు సరిగదా ... వండుకోవడానికి ఓ చిప్పయినా యివ్వని కఠిన మనస్సున్న స్త్రీని చూస్తున్నానిప్పుడు !!... "

ఆగేడు మూర్తి ఊపిరి పీల్చుకుందుకు. చుట్టూ కలియచూసేడు. అతని కళ్ళకు అందంగా అలంకరించిన ఆ ఇల్లూ...ఆ గదిలో సోఫాలూ, కుర్చీలూ, వగైరాలు నిండుగా కనిపించేయి.

పావని నిశ్చేష్టురాలై మూర్తి వంకే చూస్తోంది.

మళ్లీ మూర్తే గొంతు విప్పేడు.

"చూడమ్మా పావనీ..., నీ ఇంట్లో ఉన్న ఈ సోఫాలూ, కుర్చీలూ, ఆ డైనింగ్ టేబిలూ, ఈ సామాన్లూ, నీ భర్తా, నువ్వూ కలిసి హాయిగా తిరిగి వచ్చేందుకు ఉన్న ఆ స్కూటరూ చూసి, యితరులు నువ్వేదో గొప్పదానివని అను కుంటారని భ్రమ పడితే...అది నీ వెర్రి భ్రమే అవుతుంది.

ఇవన్నీ మీ అత్తమామలు కాలిగోటికి కూడ పోలవు...వాళ్ళు నీ భర్తను ఎలా చదివించు కున్నారో?...ఎన్ని అవస్థలు పడ్డారో నీకుతెలీదు. అత్తమామల్ని వేరేపెట్టి, వాళ్లుండేందుకు నీ ఇంట్లోనే ఓ చీకటి కొట్లో స్థానం కల్పించిన నువ్వు, లోకులు నిన్నేదో అంటారని వ్రాస్తే అది సిగ్గుచేటవుతుంది... వస్తాను." అంటూ కదలబోయి, అయోమయంగా చూస్తున్న తన బావ మధువేపు తిరిగి అన్నాడు.

"మధూ !... కన్నవాళ్ళ కడుపులు మాడ్చి పస్తులు పెట్టి నువ్వు షికార్లూ, సినిమాల్లు తిరిగితే కాదనేందుకు ఎవళ్ళూ లేకపోవచ్చునేమో గాని... రేపు నువ్వు కన్నవాళ్ళు నిన్ను యిలాగే, యిప్పుడు నీ కన్నవాళ్ళను నువ్వు చూస్తున్నట్లు గానే చూస్తే, నీకెలా వుంటుందో ఆలోచించు... వస్తాను."

అంటూ చరచరా కదిలి వెళ్ళిపోతున్న మూర్తివేపు రెప్పలు వేయకుండా చూస్తు నించుండిపోయారు ఆ గదిలో ఉన్న పావనీ, మధూలు, వరండాలో వున్న నరశింహం — అన్నపూర్ణమ్మగార్లున్నూ... ★

తేడా !

ఆలోచింప శక్తిలేని
"హంస" పాలను, నీళ్ళను
వేరుచేసి, పాలను త్రాగి
నీళ్ళను వదిలేస్తుంది !
ఆలోచనా శక్తి ఉన్న
"మనిషి" మంచిని
గ్రహించి, చెడును
విసర్జించలేకపోతున్నాడు.

— నగేష్